

ఆది దేవునికి వందనం

వేములవాడ: రాజన్నను సోమవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. హైదరాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి మొక్కులు చెల్లించుకున్నారు.



ధరలు తగ్గించాలి

సిరిసిల్లటౌన్: నిత్యావసరాల ధరలను వెంటనే తగ్గించాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత కోరారు. సిరిసిల్లలోని డీసీసీ ఆఫీస్ ముందు సోమవారం నిరసన తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రోజంతా ఉక్కపోతగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం చాలా స్వల్పంగా ఉంది.



పత్తి మొక్కలను బతికించుకునేందుకు..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తొలకరి జల్లులతో పత్తి విత్తనాలు విత్తుకున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు ముఖం చాటేయడంతో పత్తి మొక్కలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఇప్పటికే సాగుకు ఎకరాకు రూ.12వేల వరకు ఖర్చు చేసిన రైతులు ఆ మొక్కలను కాపాడుకునేందుకు బోరుబావుల నుంచి చిన్న పైపుల ద్వారా నీరు పడుతున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని దుమాల గ్రామానికి చెందిన పత్తి రైతు గుల్లపల్లి నరసింహారెడ్డి తన వ్యవసాయక్షేత్రంలో పత్తిమొక్కలను కాపాడుకునేందుకు గత రెండు రోజులుగా కుటుంబ సభ్యులతో కలిసి బోరుబావి నుంచి నీటిని చిన్నసైజ్ పైపులతో పడుతున్నారు. వర్షాలు కురవకపోతే నిండా మునిగిపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుట్టలు గుల్ల

- విచ్చలవిడిగా తవ్వకాలు
- యథేచ్ఛగా మట్టి అక్రమ తరలింపు
- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి



సాక్షి ఫొటోస్ సాక్షి సాక్షి ఫొటోస్

టిప్పర్‌లో అక్రమంగా తరలుతున్న మట్టి

సిరిసిల్లఅర్బన్: అక్రమార్కులకు అడ్డూ.. అదుపు లేకుండా పోతోంది. ప్రకృతి సందను దోచేస్తూ ఆర్థికంగా బలోపేతమవుతున్నారు. అనుమతులు లేకుండానే గుట్టలను గుల్ల చేస్తున్నారు. అధికారుల కళ్ల ముందే జరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఒక వేళ సామన్యులు ప్రశ్నిస్తే దాడులకు సైతం వెనుకాడడం లేదు. ఇసుక మాఫియా కన్నా పేట్రేగిపోతున్న వీరిని అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడంపై అనుమానాలు కలుగుతున్నాయి. ఒకవైపు ప్రకృతి సంపదను కొల్లగొడుతూ, మరోవైపు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

జోరుగా రవాణా

సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరులో మట్టి అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా జేసీబీలతో మట్టిని తోడుతూ టిప్పర్లలో తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. పెద్దూరు శివారులోని ప్రభుత్వ భూములు, ఎద్దుగుట్ట, మైసమ్మ గుట్టలను గుల్ల చేస్తున్నారు. కట్టడి చేయాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో మట్టి అక్రమ రవాణాకు అడ్డూ.. అదుపులేకుండా పోతోంది.

యథేచ్ఛగా తరలింపు

పెద్దూరు శివారులోని మానేరువాగు పక్కన మైసమ్మగుట్ట, ఎద్దుగట్ట, ప్రభుత్వ భూముల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. సిరిసిల్ల రెండో బైపాస్‌లో వెలసిన వెంచర్లకు మట్టిని అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో ట్రిప్పునకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇష్టారాజ్యంగా తవ్వకాలతో ప్రకృతి సంపద మాయమవుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

రాత్రివేళలో మరింత జోరు

రాత్రివేళలో మట్టి తరలింపు జోరుగా సాగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సెలవు దినాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల పర్యవేక్షణ ఉండకపోవడం అక్రమార్కులకు కలసివస్తోంది. సెలవు దినాల్లో జోరుగా మట్టిని తరలిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ సెలవు దినం రోజున అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను స్థానికులు అడ్డుకుని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి అక్రమ మట్టి తరలింపును అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



పెద్దూరు, సర్దాపూర్ శివారులోని గుట్టల నుంచి అనుమతులు లేకుండా మట్టిని తవ్వుతున్నారు. రాత్రివేళల్లో మరింత జోరుగా సాగుతోంది. పలుమార్లు రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మట్టి అక్రమ రవాణాను కట్టడి చేయాలి.

– బర్కం నవీన్‌యాదవ్, పెద్దూరు

ఇష్టానుసారంగా తవ్వుతున్నారు



గుట్టలను ఇష్టానుసారంగా తవ్వుతూ ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. పట్టించుకునే వారు లేక ఇష్టారాజ్యంగా మట్టిని తవ్వేస్తున్నారు. అధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలి.

– శ్రీనివాస్‌గౌడ్, పెద్దూరు

కఠిన చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా మట్టిని తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. కేవలం ప్రభుత్వం చేపడుతున్న పనుల అవసరాలకే అనుమతి ఇస్తున్నాం. నిబంధనలను బేఖాతర్ చేసి మట్టి తరలించిన వాహనాలను సీజ్ చేస్తాం. అక్రమ మట్టి రవాణాపై ప్రజలు సమాచారం అందించాలి.

– విజయ్‌కుమార్, సిరిసిల్ల తహసీల్దార్

సమస్యలు పరిష్కరించండి సారూ..

- ప్రజావాణికి వినతుల వెల్లువ
- బారులుతీరిన బాధితులు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ అనురాగ్‌జయంతి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లఅర్బన్: సమస్యలు పరిష్కరించండి సారూ.. అంటూ జిల్లా నలుమూలల నుంచి బాధితులు తండోపాతండాలుగా తరలివచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వచ్చి తమ సమస్యలపై కలెక్టర్ అనురాగ్ జయంతికి అర్జీలు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ప్రజావాణికి రెవెన్యూ 24, మున్సిపల్ 7, డీపీవో 5, టీపీవో 9 తదితర వాటితో కలిపి మొత్తం 56 ఫిర్యాదులు వచ్చాయి. అడిషనల్ కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్ ఉన్నారు.

చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి



ముస్తాబాద్ మండలం ఆవునూర్‌లోని పెద్దచెరువు, కాటన్ చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఈ చెరువు చుట్టు పక్కన ఉన్న కొందరు చెరువు భూమిని ఆక్రమించి సాగు చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– క్రాంతికుమార్, ఆవునూరు

రేషన్‌కార్డు మంజూరు చేయాలి



నాపేరు ఎలవేణి స్వప్న. ఇద్దరు అమ్మాయిలు. నా భర్త నాలుగేళ్ల క్రితం మృతిచెందాడు. రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదు. పెన్షన్ డబ్బులు, కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలను సాదుకుంటున్నాను. అధికారులు స్పందించి రేషన్‌కార్డు వచ్చేలా చూడాలి.

– స్వప్న, మారుపాక

ఆసరా పెన్షన్ ఇప్పించండి



ఏడాదిన్నర కిందట జరిగిన ప్రమాదంలో నా కుడి కాలు విరిగిపోయింది. అప్పటి నుంచి ఒకరి సహాయం లేనిది సరిగ్గా నడవలేను. సదరం సర్టిఫికెట్ కూడా ఉంది. చాలాసార్లు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న. అయినా రావడం లేదు.

– వెంకటేశం, రాజన్నపేట

పాసుబుక్కులు పంపిణీ చేయాలి



మేము దాదాపు 50 నిరుపేద కుటుంబాల వాళ్లం నలభై ఏళ్లకు పైగా 187, 310 సర్వేనంబర్‌లలో ఖాస్తులో ఉండి సాగు చేసుకుంటున్నాం. ఆ భూములకు పాస్‌బుక్‌లు ఇవ్వాలని చాలా సార్లు అర్జీలు పెట్టుకున్నాం. అధికారులు స్పందించి పాసుబుక్కులు ఇచ్చి ఆదుకోవాలి.

– ముస్తాఫానగర్ గ్రామస్తులు

న్యాయం చేయండి



గంభీరావుపేట మండలం జగదాం బతండాలో గిరిజనుల పోడు భూముల పట్టాలు ఇప్పించేందుకు గ్రామపంచాయతీ పోడుభూములు కమిటీ 124 మందిని ప్రతిపాదించారు. అటవీశాఖ అధికారులు 38 మంది సాగులో లేరని అనర్హులుగా గుర్తించారు. వారంతా ముప్పై ఏళ్లుగా సాగుచేసుకుంటూనే ఉన్నారు. అధికారులు రీసర్వే చేసి న్యాయం చేయాలి.

– పోడు భూముల కమిటీ సభ్యులు

అనుమతులు లేని ప్లాట్లు



వేములవాడరూరల్: కోనాయపల్లి పరిధిలో లేఅవుట్ లేని వెంచర్లలో ప్లాట్లు విక్రయిస్తున్నారు. ఆ ప్లాట్లను కొన్న యజమానులు అనుమతులు తీసుకోకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులకు ముడుపులు ఇచ్చి సర్వే నంబర్లు తీసుకొని నిబంధనలు పాటించకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు.

– వెంకట్‌రెడ్డి, కోనాయపల్లి

న్యూస్‌రీల్

గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు అజ్మీరా రాజునాయక్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం గుంటపల్లిచెరువు తండాలో 44 మందికి పోడుపట్టాలను ఇవ్వడమే కాకుండా, రైతుబంధు, రైతుబీమా వర్తింపజేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ పంట పొలాల్లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు సోమవారం క్షీరాభిషేకం చేశారు. జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు అజ్మీరా తిరుపతినాయక్, ఉపసర్పంచ్ కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం కురవాలి వానా దేవుడా



చందుర్తి/కోనరావుపేట(వేములవాడ): వర్షాకాలం ప్రారంభమై దాదాపు నెల రోజులు గడుస్తున్నా వానలు పడకపోవడంతో జిల్లా వ్యాప్తంగా ప్రజలు వర్షాలు కురవాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేస్తున్నారు. చందుర్తి మండలం కిష్టంపేటలో సోమవారం సర్పంచ్ కల్పన ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. కోనరావుపేట మండలం కొండాపూర్‌లో రైతులు గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. కప్పతల్లి ఆట ఆడారు.

నేడు దొడ్డి కొమురయ్య వర్ధంతి

సిరిసిల్ల: తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టరేట్ ఏవో బొద్దుల గంగయ్య సోమవారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టరేట్‌లో ఉదయం 10.30 గంటలకు దొడ్డి కొమురయ్య వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. ఏటా ఈనెల 4న దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.

మంత్రి పర్యటన వాయిదా

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండలంలో బుధవారం రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పర్యటన వాయిదా పడినట్లు వైస్ ఎంపీపీ చిన్నభూమయ్య ప్రకటనలో తెలిపారు. మండలంలోని మానాల, గిరిజన తండా గ్రామాలకు చెందిన గిరిజనులకు మంత్రి చేతులమీదుగా పోడుపట్టాల పంపిణీ చేయాలని నిర్ణయించారు. అయితే అనివార్య కారణాలతో మంత్రి పర్యటన వాయిదా పడ్డట్లు పేర్కొన్నారు. త్వరలోనే మంత్రి పర్యటన ఉంటుందని, గిరిజనులు ఆందోళన చెందొద్దని కోరారు.

ప్రాణాలు కాపాడడమే లక్ష్యం

- జిల్లాలో రోడ్డు సేఫ్టీ కమిటీలు
- క్షతగాత్రులను రక్షించడమే లక్ష్యం
- గ్రామానికి 10 మందితో కమిటీ
- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రుల ప్రాణాలు కాపాడడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని ప్రతీ గ్రామంలో రోడ్డు సేఫ్టీ విలేజ్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిరిసిల్లలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన కార్డియో పల్మనరీ రెసిస్టేషన్ (సీపీఆర్) అవగాహన సదస్సులో ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రతి గ్రామంలో పది మందితో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కమిటీలోని వలంటీర్ల వివరాలను గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. ప్రాణాలు కాపాడేందుకు అవసరమైన శిక్షణను నెలకోసారి స్థానిక పీహెచ్‌సీలలో అందించనున్నట్లు తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించి ప్రాణాలు కాపాడేలా కమిటీ బాధ్యులు పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఏడాది కాలంలో ప్రమాద బాధితుల ప్రాణరక్షణలో ప్రతిభ చూపిన వలంటీర్లకు జనవరి 26, ఆగస్టు 15న అవార్డులు, రివార్డులు అందజేయనున్నట్లు తెలిపారు.

హెల్మెట్ లేకనే పోతున్న ప్రాణాలు

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతోనే ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు పోతున్నాయని సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రి పర్యవేక్షకులు మురళీధర్‌రావు అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యం చేరుకోవాలన్నారు.

బాలకార్మికుల నిర్మూలన అందరి బాధ్యత

బాలకార్మికుల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆపరేషన్ ముస్కాన్ నిర్వహణపై పోస్టర్ ఆవిష్కరించారు. నిస్సహాయ స్థితిలో ఉన్న బాలల చిరునవ్వులే లక్ష్యంగా ఆపరేషన్ ముస్కాన్ ముందుకుసాగాలన్నారు. ఈ నెలాఖరు వరకు ఆపరేషన్ ముస్కాన్ కొనసాగుతుందని తెలిపారు. దుకాణాలు, హోటళ్లలో బాలకార్మికులు పనిచేస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు నాగేంద్రచారి, రవికుమార్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అంజయ్య, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, ఎస్సై శ్రీకాంత్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేలో సమస్యలు పరిష్కారం

బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు ప్రతీ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఫిర్యాదుదారులు నేరుగా తమ సమస్యలను విన్నవించుకోవచ్చన్నారు. ఈ సోమవారం 18 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను సహించబోమని హెచ్చరించారు.

ఎస్సీ, ఎస్టీలు సుస్థిర జీవనోపాధి సాధించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీలు

సిరిసిల్ల: ఎస్సీ, ఎస్టీలు సుస్థిరమైన జీవనోపాధి సాధించేలా అధికారులు ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 150 మందికి ఉద్యోగాల కోసం శిక్షణ ఇచ్చామని, దళితబంధులో వారికి అనుభవం ఉన్న రంగాల్లో యూనిట్లు ఏర్పాటు చేశామన్నారు. వేములవాడ ఆలయం నుంచి వచ్చే కొబ్బరి పీచు నుంచి ఇతర ఉత్పత్తులను తయారు చేసేలా యూనిట్లు స్థాపించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు పాడిగేదెల పథకాలు అందించినట్లు తెలిపారు. జిల్లాలో ఎస్టీలకు ప్రభుత్వ పథకాలు, వాటి ప్రయోజనాలు అందేలా పర్యవేక్షణకు అడిషనల్ పీడీని నియమిస్తామని తెలిపారు. జిల్లాలో 2018 నుంచి ఇప్పటి వరకు 55 ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదయ్యాయని, బాధితులకు సత్వర న్యాయం దక్కుతుందని తెలిపారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించేందుకు పోలీస్‌శాఖ కృషి చేస్తుందన్నారు. ఆర్డీవో పవన్‌కుమార్, ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, పశుసంవర్ధకశాఖ అధికారి కొమురయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్, బీసీ అభివృద్ధి అధికారి రాఘవేంద్ర, కమిటీ సభ్యులు తిరుపతి, సుధాకర్, ఈశ్వర్, రాంచందర్ పాల్గొన్నారు.

డుమ్మా మాస్టార్లు!

- ఉమ్మడి జిల్లాలో సరిగా అమలుకాని బయోమెట్రిక్
- హాజరు విషయంలో సమయపాలనకు మంగళం
- బడికి రాకపోయినా ఆన్‌డ్యూటీలుగా నమోదు
- సీఆర్‌పీలు, ఇన్‌చార్జి ఎంఈవోలు సైతం ఇదే బాటలో



జిల్లా	పాఠశాలలు	ఉపాధ్యాయులు	విద్యార్థులు
కరీంనగర్	623	2,787	36,775
జగిత్యాల	748	3,915	65,632
పెద్దపల్లి	580	2,423	45,626
సిరిసిల్ల	510	2,651	37,803

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉపాధ్యాయుల హాజరు కోసం ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ విధానం పూర్తిస్థాయిలో అమలు కావడంలేదు. ఇటీవల కరీంనగర్ డీఈవో చొప్పదండికి తనిఖీకి వెళ్లినప్పుడు ముగ్గురు టీచర్లు ఆలస్యంగా రావడంతో వారిని సీఎల్ పెట్టుకోమని ఆదేశించారు. మరోవైపు జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలోనూ ఇదే తరహా పరిస్థితి ఉంది. ఈవ్యవహారంపై కొందరు సమాచార హక్కుద్వారా జగిత్యాల విద్యాశాఖ నుంచి వివరాలు కోరినప్పుడు గురువుల డుమ్మాల బాగోతం బయటపడింది. బడికిరాకున్నా.. వచ్చినట్లు అటెండెన్స్ వేసుకునే మాస్టార్ల నిర్వాకం వెలుగుచూసింది. ఎవరి అనుమతి తీసుకోకుండా మాస్టార్లు రోజుల తరబడి బడికి రాకపోవడం.. సమయపాలన పాటించకపోవడం తదితరాలన్నీ స్పష్టంగా తెలిశాయి.

ఏం జరుగుతోంది?

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైమరీ స్కూళ్లు ఉదయం 9 నుంచి 4 గంటలు, హైస్కూలు 9.30 నుంచి 4.45 గంటల వరకు ఉపాధ్యాయులు పాఠశాలల్లో ఉండాలి. కొందరు గురువులు ఈ సమయపాలన పాటించడం లేదు. చాలామంది గంట లేదా రెండు గంటలు ఆలస్యంగా రావడం, లేదా గంట..గంటన్నర ముందుగానే వెళ్లిపోవడం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ విద్యా సంబంధిత కార్యక్రమాల అమలుకోసం క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్‌పీ)లను నియమిస్తారు. ఈపనుల మీద వివిధ స్కూళ్లకు వెళ్లాల్సి వస్తోంది. కానీ.. పనులు లేనప్పుడు కూడా సీఆర్‌పీలు హాజరు కావడంలేదు. వీరు ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహించే సమయంలో ఆన్‌డ్యూటీ (ఓడీ)లుగా నమోదు చేస్తున్నారు. సీఆర్‌పీలతోపాటు కొందరు ఉపాధ్యాయులు కూడా పలుచోట్ల ఓడీలుగా నమోదు చేసుకుంటున్నారు. ఎలాంటి అదనపు విధులు లేని ఉపాధ్యాయులు కూడా ఓడీలు ఎందుకు పెట్టుకుంటున్నారో వారికే తెలియాలని తోటి టీచర్లు వాపోతున్నారు. ఆలస్యంగా వచ్చినా.. ముందుగా వెళ్లినా వీరెవరికీ వేతనాల్లో ఎలాంటి కోతలు విధించడం లేదు. గతేడాది మధ్యలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తరచుగా ఆలస్యంగా వచ్చే పలువురు ఉపాధ్యాయులకు మెమోలతో సరిపెట్టారు. ఆ తర్వాత వీరెవరిపైనా ఎలాంటి పర్యవేక్షణ లేదు. దీంతో చాలామంది టీచర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

నిర్వహణ అంతంతే..

రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో కేవలం 14 జిల్లాల్లో మాత్రమే బయోమెట్రిక్ అమలవుతుంది. ఉమ్మడి జిల్లాలో బయోమెట్రిక్ నిర్వహణ ఓ ఏజెన్సీకి అప్పగించారు. పొరపాటున ఏదైనా స్కూల్లో బయోమెట్రిక్ యంత్రం మొరాయించినా.. సాంకేతిక సమస్యలు తలెత్తినా దాన్ని వెంటనే రిపేరు చేయడం లేదు. సదరు ఏజెన్సీ నిర్వాహకులు ఫిర్యాదు చేసినా వారం లేదా రెండు వారాల తర్వాత వచ్చి బాగు చేస్తున్నారు. ఇదే అదనుగా పలువురు ఉపాధ్యాయులు ఏకంగా పాఠశాలకు డుమ్మాలు కొట్టేస్తున్నారు. సాధారణ ఉపాధ్యాయులతో పాటు ఇన్‌చార్జి ఎంఈవోలు కూడా ఇదే బాటలో పయనిస్తున్నారు. కొందరు ఇన్‌చార్జి ఎంఈవోలు ఏకంగా 15 రోజులపాటు ఆన్‌డ్యూటీలు పెట్టుకున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. నిరంతరం స్కూలుకు ఆలస్యంగా వస్తూ.. డుమ్మాలు కొడుతూ ఆన్‌డ్యూటీలు వేసుకుంటున్న టీచర్లపై విద్యార్థుల తల్లిదండ్రులు, తోటి ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. బడికి రాకున్నా.. దొడ్డిదారిలో హాజరు వేసుకుని, జీతం తీసుకోవడం ఎక్కడి నైతికత అని విమర్శిస్తున్నారు.

గురువులతోనే చైతన్యవంత సమాజం

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



సిరిసిల్ల: సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో గురువుల పాత్ర కీలకమని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. సిరిసిల్లలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గురువందనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరరై మాట్లాడారు. విద్యార్థులను సరైనమార్గంలో నడిపించేలా బోధించడం ఉపాధ్యాయుల కర్తవ్యమన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదన్నారు. పలువురు టీచర్లను సన్మానించారు. డీఈవో రమేశ్ కుమార్, నాయకులు హన్మంతరావు, శ్రీనివాస్, కృష్ణారెడ్డి, పద్మారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మార్షల్ ఆర్ట్స్‌లో ఉచిత శిక్షణ

సిరిసిల్ల: సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. విజయ రఘునందన్ తెలిపారు. విద్యార్థులకు కరాటే శిక్షణ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు మానసికోల్లాసం కోసం మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇస్తున్నామన్నారు. కరాటేతో ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. బాల, బాలికలకు వేర్వేరుగా కరాటే శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ వి.శ్రీనివాస్, కళాశాల అధ్యాపకుడు బుర్ర వెంకటేశం, సామల వివేకానంద, సురేశ్, ఆంజనేయులు, చంద్రమౌళి, వెంకటేశ్, పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు



తంగళ్లపల్లి(సిరిసిల్ల): గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసి వారి నుంచి కిలోన్నర గంజాయి ప్యాకెట్లను సీజ్ చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ బి.ఉపేందర్ తెలిపారు. మండలంలోని మండెపల్లి గ్రామ శివారులోని రామాలయం గుడి ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో 1కిలో 470 గ్రాముల గంజాయి ప్యాకెట్లు పట్టుకొని ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్లు తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న సిరిసిల్ల పట్టణానికి చెందిన ఎండీ.అహ్మద్ అలియాస్ అహ్మద్ పాషా (21), గడదాస్ శివ అలియాస్ శ్రీకాంత్ (23), తాళ్లపల్లి ప్రణయ్ (25)ను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. నాందేడ్‌లో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి జిల్లాలో విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి, పోలీస్ సిబ్బంది నరేందర్, కార్తీక్, తిరుపతి, శ్రీనివాస్‌ను సీఐ అభినందించారు.

కల్లు తాగించి.. వృద్ధురాలి మెడలోంచి పుస్తెలతాడు చోరీ

ముస్తాబాద్(సిరిసిల్ల): రైతుబంధు డబ్బుల కోసం వచ్చిన వృద్ధురాలి మెడలోంచి ఓ మహిళ పుస్తెలతాడుతో చోరీ చేసింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పోతుగల్‌కు చెందిన మరిపెళ్ల నర్సవ్వ రైతుబంధు డబ్బుల కోసం సోమవారం ముస్తాబాద్‌లోని బ్యాంకుకు వచ్చింది. దాహం వేస్తుందని దుకాణాల్లో అడుగుతుండగా గమనించిన ఓ గుర్తు తెలియని మహిళ కల్లు తాగిస్తానంటూ కల్లు దుకాణానికి తీసుకెళ్లింది. కల్లు తాగించి నర్సవ్వ మత్తులోకి జారుకోగానే మెడలోని మూడు తులాల పుస్తెలతాడుతో పరారైంది. వృద్ధురాలి లబోదిబోమనడంతో కల్లు దుకాణం నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా వివరాలు తెలుసుకొని బస్సుల్లో తనిఖీలు చేపట్టారు.

మేమేం చేశాం పాపం.!

బోయినపల్లి (చొప్పదండి): కుటుంబ కలహాలు.. అదనపు కట్నం, గృహహింస వంటి వేధింపులతో మహిళలు తనువు చాలిస్తున్నారు. తాను చనిపోతున్నపుడు పిల్లల బాగోగులు ఎవరు చూస్తారు అని పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇలాంటి సంఘటనలు ఇటీవలి కాలంలో ఎక్కువవుతున్నాయి. దీనిపై అధికారులు దృష్టిసారించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు.

- కుటుంబ కలహాలకు బలవుతున్న చిన్నారులు
- క్షణికావేశంలో బలవన్మరణాలు
- వారం క్రితం మధ్యమానేరులో ముగ్గురు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్య
- గతంలో పిల్లలతో ఇద్దరు తల్లుల బలవన్మరణం



ముగ్గురు పిల్లలతో ఆత్మహత్య చేసుకున్న రజిత (ఫైల్)

ఇద్దరు పిల్లలతో కలిసి..

- వరకట్న వేధింపులు తాళలేక రజిత అలియాస్ నేహ (33) వారం క్రితం క్రితం మధ్య మానేరులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జిల్లాలో సంచలనం రేపింది. కరీంనగర్ జిల్లా సుభాష్‌నగర్‌కు చెందిన మహ్మద్ అలీని ప్రేమ వివాహం చేసుకున్న వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన రజిత ముగ్గురు పిల్లలతో కలిసి బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే.. ప్రేమవివాహం చేసుకున్న భర్తే వరకట్నం కోసం వేధించగా క్షణికావేశంలో కుమారుడు అయాన్ (7), కూతురు అశ్రజబీన్ (5), 14 నెలల పసికందు ఉస్మాద్ హైమద్‌తో కలిసి మిడ్‌మానేరు రాళ్ల తెట్టె నీళ్లలో దూకి ఆత్మహత్య చేసుకుంది.. ప్రభుత్వం ఫోర్‌లేన్ బ్రిడ్జిపై పెద్దఎత్తున ఇనుప జాలీలు ఏర్పాటు చేశాక ఆత్మహత్యలు భారీగా తగ్గాయి. అయితే జాలీలతో మధ్యమానేరులో దూకే వీలు లేనందున రజిత బ్రిడ్జి పరిసరాల్లోని రాళ్ల తెట్టె నుంచి నీళ్లలో దూకి ఆత్మహత్య చేసుకుంది.

గతంలో వేర్వేరు ఘటనల్లో..

- బోయినపల్లి మండలకేంద్రానికి చెందిన ఓ వివాహిత (22), 2022 మే 12న వేధింపులు తాళలేక ఇద్దరు కుమారులతో కలిసి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఇందులో ఓ కుమారుడి వయస్సు మూడేళ్లు, మరో కుమారుడు 18 నెలల పసికందు కావడం గమనార్హం. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. 2019 ఆగస్టు 4న బోయినపల్లి గ్రామానికి చెందిన వివాహిత (24) ఇంట్లోనే ఇద్దరు కూతుళ్లకు ఉరేసి తాను ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కన్నీరు పెట్టించింది. ఐదేళ్లు, మూడేళ్ల వయస్సు గల ఇద్దరు కూతుళ్లతో ఉరేసుకొని తల్లి బలవన్మరణం చెందింది.

అగమ్య గోచరంగా భావితరాల భవిష్యత్తు

- కుటంబ కలహాలు, వేధింపులతో పిల్లలతో కలిసి ఆత్మహత్యలకు పాల్పడుతుండడంతో భావితరాల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు ఎదుర్కొలేక చావే శరణ్యమని తీసుకుంటున్న నిర్ణయాలు పసి పిల్లలను బలి తీసుకోవడం బాధాకరం. వరుస సంఘటనలు చోటు చేసుకుంటుండటంతో ఇలాంటి సున్నిత అంశాల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలి..? కౌన్సిలింగ్, పలు అంశాలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

- వామపక్షాలు..ప్రజాసంఘాల నిరసన
- వినతిపత్రాల అందజేత



కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాలు, వామపక్షాల ధర్నా

సిరిసిల్లటౌన్: జిల్లాలో సీపీఐ, సీపీఎం పార్టీలతో పాటు ప్రజాసంఘాలు, కులసంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు.

పేదలకు నివేశన స్థలాలివ్వాలి..

గూడు లేని నిరుపేదలందరికీ నివేశన స్థలాలను ఇవ్వాలని సీపీఐ కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల నుంచి సొంతిల్లు లేని నిరుపేదలతో కలెక్టరేట్ ముట్టడి చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ డబుల్‌బెడ్ రూం ఇళ్లు అందించాలన్నారు. పేదలకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ ఇప్పుడు గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షలు మాత్రమే అందిస్తామనడం హాస్యాస్పదమన్నారు. రానున్న ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సరైన గుణపాఠం తప్పదన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవో గంగయ్యకు వినతిపత్రం అందజేశారు. నాయకులు సామల మల్లేశం, కడారి రాములు, మంచికట్ల రమేశ్, అజ్జ వేణు, వడ్డెపల్లి లక్ష్మణ్ తదితరులున్నారు.

'గృహలక్ష్మి' వర్తింపజేయాలి

జిల్లాలో గతంలో ఇచ్చిన ఇందిరమ్మ ప్లాట్లకు గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. డబుల్ బెడ్‌రూం ఇళ్లు అర్హులకు ఇవ్వడం లేదని ఆరోపిస్తూ కలెక్టరేట్ ఎదుట సీపీఎం, ప్రజాసంఘాలు, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టగా వక్తలు మాట్లాడారు. ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి రూ.3 లక్షలు కాకుండా రూ.5లక్షలు అందించాలన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, ప్రజాసంఘాల నాయకులు రామంచ అశోక్, చిలుక బాలు, గన్నేరం నర్సయ్య, ఎరవెల్లి నాగరాజు, ఐద్వా అధ్యక్షురాలు సూరం పద్మ, మంద అనిల్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరులకు న్యాయం చేయాలి

వడ్డెర కులస్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయం చేయాలని రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షుడు పల్లపు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. వడ్డెరుల స్థితిగతులపై అధ్యయనం చేయాలని, బీసీ కులాల నుంచి తొలగించి ఎస్టీ తెగల్లో చేర్చాలన్నారు. అర్హులైన వడ్డెరులకు కులవృత్తుల రుణాలు అందించాలని, హైదరాబాద్‌లో నిర్మిస్తున్న వడ్డెర ఆత్మగౌరవ భవనానికి ప్రభుత్వం రూ. 5 కోట్లు అందించాలన్నారు. వడ్డెరుల సమస్యలపై కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. నాయకులు దండగుల తిరుపతి, శివరాత్రి రాజు, లక్ష్మణ్, బాబు, ప్రవీణ్, రాకేశ్, హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



పిట్ల తేజస్విని



కుసుమ భరత్



ఊరుకొండ నందిని



వడ్డెపల్లి వైష్ణవి



ఎస్.వేణు



బూర్ల శ్రీలక్ష్మి



గడదాసు వర్ష



వేముల శ్రీజ

సిరిసిల్లఎడ్యుకేషన్: బాసర ట్రిపుల్ ఐటీకి సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. శివనగర్‌లోని కుసుమ రామయ్య జెడ్పీ పాఠశాలకు చెందిన ఊరుగొండ నందిని, వడ్డెపల్లి వైష్ణవి, కుసుమ భరత్ ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. గీతానగర్‌లోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో చదివిన బూర్ల శ్రీ లక్ష్మి, పిట్ల తేజస్విని, ఎస్.వేణు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. అంబేద్కర్ నగర్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన గడదాసు వర్ష, వేముల శ్రీతేజ ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు భాగ్యరేఖ, ఎస్ఎంసీ చైర్మన్ కోడం శ్రీధర్, కౌన్సిలర్ ఎల్లండి దేవదాసు, ఉపాధ్యాయులు భూపాల్‌రెడ్డి, పాతూరి మహేందర్ రెడ్డి, పురుషోత్తం, శంకర్‌గౌడ్, తదితరులు అభినందించారు.

ఎల్లారెడ్డిపేట జెడ్పీ ఉన్నత పాఠశాల..



బత్తుల హారిని



ఎండీ రిహాన్



నేవూరి హారిక



సిరిసిల్ల పల్లవి



గాజుల వైష్ణవి



కొడిమ్యాల చందన

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన ఆరుగురు విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దబ్బెడ హన్మాండ్లు సోమవారం తెలిపారు. ఒకే పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపిక కావడం విశేషం. పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులు నేవూరి నిహారిక, మహ్మద్ రిహాన్, బత్తుల హారిణి, సిరిసిల్ల పల్లవి, గాజుల వైష్ణవి, కొడిమ్యాల చందన ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, ఎస్ఎంసీ చైర్మన్ అఫ్జల్ షహనాజ్, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి అభినందించారు.

హన్మాజీపేట విద్యార్థి..



సాయిచరణ్

వేములవాడరూరల్: బాసర ట్రిపుల్ ఐటీకి మండలంలోని హన్మాజీపేట చెందిన విద్యార్థి ఎంపికయ్యాడు. హన్మాజీపేట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదివిన అన్నాడి సాయిచరణ్ 9.7 జీపీఏతో ట్రిపుల్ ఐటీకి ఎంపికవడంపై హెచ్ఎం ఉమారాణి, విద్యార్థులు అభినందించారు.

కస్టమ్ మిల్లింగ్ జరిగేలా చూడాలి

- అవెన్యూ ప్లాంటేషన్‌కు ట్రీగార్డులు ఏర్పాటు చేయాలి
- గొర్రెల పంపిణీలో జియోట్యాగింగ్ చేయాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలోని రైస్‌మిల్లులను క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి కస్టమ్ మిల్లింగ్ వేగంగా జరిగేలా చూడాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లాలో తహసీల్దార్ బృందాలు తనిఖీలు చేసి మిల్లింగ్ జరిగేలా చూడాలన్నారు. ఎరువుల కొరత లేకుండా చూడాలని, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి రైతులకు ఎరువులు, విత్తనాలు అందేలా చూడాలని ఆదేశించారు. ఉపాధిహామీలో మొక్కలు నాటాలని, అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలకు ట్రీగార్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. హరితహారం పనులు ప్రణాళికాబద్ధంగా చేయాలని సూచించారు. బీసీ కులవృత్తులకు రూ.లక్ష సాయం అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెండో విడతలో పంపిణీ చేసే గొర్రెలకు జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు. అంతకుముందు హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఎన్.ఖీమ్యానాయక్, వేములవాడ ఆర్డీవో పి.పవన్‌కుమార్, డీఆర్‌డీవో బి.గౌతమ్‌రెడ్డి, డీపీవో రవీందర్, డీఏవో భాస్కర్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, డీఎస్‌వో జితేందర్ రెడ్డి, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.


వీధికుక్కల దాడిలో 50 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటకు చెందిన గొర్రెల కాపరి అంబటి మల్లయ్యకు చెందిన 50 గొర్రెలు వీధికుక్కల దాడిలో మృతిచెందాయి. ఇంటి వద్ద గల కొట్టంలోకి కుక్కలు ప్రవేశించి గొర్రెలపై దాడిచేశాయి. అరుపులు విన్న మల్లయ్య కొట్టంలోకి వచ్చేసరికి గొర్రెలను కుక్కలు చంపేశాయి. మల్లయ్యను సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొక్కు దేవేందర్‌యాదవ్ పరామర్శించారు. పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్ పంచనామా చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు.


దోపిడీకి గురిచేస్తున్న విద్యాసంస్థలు



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

సిరిసిల్ల అర్బన్: జిల్లాలో దోపిడీకి గురిచేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కొరతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం డీఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్ మాట్లాడుతూ.. జిల్లాలో కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఎలాంటి అనుమతులు లేకుండానే తరగతులు నిర్వహిస్తూ దోపిడీకి పాల్పడుతున్నాయని, పాఠశాలల్లోనే పుస్తకాలు, దుస్తులు, సామగ్రిని అమ్ముతూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని, లేకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. విద్యార్థి నాయకులు ప్రసాద్, అరవింద్, తదితరులున్నారు.

తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర కార్యదర్శిగా లక్ష్మణ్



లక్ష్మణ్

సిరిసిల్లకల్చరల్: తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర కార్యదర్శిగా పట్టణానికి చెందిన కార్మిక కవి ఆడెపు లక్ష్మణ్ ఎన్నికయ్యారు. వేదిక ఆవిర్భావం నుంచి నేటివరకు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన లక్ష్మణ్‌ను కార్యదర్శిగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆదివారం కరీంనగర్‌లో జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికల్లో కార్యదర్శిగా ఎన్నికైన లక్ష్మణ్‌ను మానేరు రచయితల సంఘం, జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు జూకంటి జగన్నాథం, టీవీ నారాయణ, ఎలగొండ రవి, మాదూరి అనిల్, కొలిపాక శోభారాణి, తదితరులు అభినందించారు.

విద్యార్థుల ఉన్నతికి చేయూత



విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థుల ఉన్నతికి రెడ్డి మిత్ర సంఘం చేయూత నందిస్తోంది. విద్యార్థులకు ప్రతినెలా బహుమతులు అందిస్తూ.. విద్యావ్యాప్తిపై వారిని ప్రోత్సహిస్తున్నారు. మండలంలోని నారాయణపూర్‌కు చెందిన రెడ్డి మిత్ర సంఘం ఆధ్వర్యంలో సోమవారం జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 20 మంది విద్యార్థులకు మెడల్స్ పంపిణీ చేశారు. పదిలో 9.5 జీపీఏ సాధించిన ఎండపల్లి రిసీతకు రూ.3వేల నగదుతో పాటు వారి తల్లిదండ్రులను సన్మానించారు. ఈ సందర్భంగా మిత్ర సంఘం సభ్యులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు మెడల్స్, బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు నిమ్మ మల్లారెడ్డి, మోతే నర్సింహారెడ్డి, మోతే మల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, గోగూరి లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నిమ్మ అనిల్ రెడ్డి, వంగల దేవిరెడ్డి, మోతే దేవిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు కృష్ణహరి, అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

- ముకాస రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య



కోడె మొక్కులు చెల్లించుకుంటున్న నాయకులు

వేములవాడ: రాష్ట్రంలో అత్యధిక జనాభా గల మున్నూరు కాపు కులస్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఏటా రూ.5వేల కోట్లు కేటాయించాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య కోరారు. వారి సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాజన్నను దర్శించుకుని కోడెమొక్కులు చెల్లించారు. వారు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని కోకపేటలో కేటాయించిన ఐదు ఎకరాలలో భవన నిర్మాణానికి రూ.5 కోట్లు విడుదల చేయడం అభినందనీయమన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో రెండెకరాలు కేటాయించాలని, మహిళలకు ఆత్మభవన్, విద్యార్థులకు స్టడీసర్కిల్ ఏర్పాటు చేయాలని కోరారు. చల్ల హరిశంకర్, కల్లూరి రాజు, చిలుక రమేశ్, కొమురయ్య ఉన్నారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: బీటెక్ చదివిన తనకు ఉద్యోగం రావడంలేదన్న బెంగతో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రంగంపల్లికి చెందిన మెంగని శ్రీకాంత్ (26) సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. రంగంపల్లిలోని ఆదర్శనగర్‌లో నివాసముంటున్న శ్రీకాంత్ బీటెక్ పూర్తిచేసి ఉద్యోగం కోసం తిరిగితిరిగి వేసారాడు. ఇక ఉద్యోగం రాదేమోనని మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

షాదీ డాట్ కామ్‌లో పరిచయమైన కి'లేడీ'


- పెళ్లయిన రెండు నెలలకు డబ్బు, బంగారంతో పరార్
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు



రేవంత్ పెళ్లి ఫొటో

జ్యోతినగర్(రామగుండం): రామగుండం ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీకి చెందిన పాన్‌షాప్ నిర్వాహకుడు వరంగల్ జిల్లాకు చెందిన ఓ యువతి మాయలో పడి మోసపోయాడు. అప్పటికే మూడు పెళ్లిల్లు చేసుకున్న మాయ లేడీ ఇక్కడి యువకున్ని మోసం చేసి డబ్బు, బంగారంతో పరారైంది. దీంతో బాధితుడు ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాలు.. ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీకి చెందిన రేవంత్‌కు అప్పటికే పెళ్లి జరిగి విడాకులయ్యాయి. అయితే ఓ షాదీ డాట్ కామ్ ద్వారా యువతి పరిచయమైంది. ఆ పరిచయం సెల్ ఫోన్లలో ముచ్చట్లు.. తర్వాత పెళ్లి వరకు వచ్చింది. ఇదే మొదటి పెళ్లి అంటూ సదరు యువతి నమ్మించింది. దీంతో రెండు కుటుంబాలకు చెందిన పెద్దలు పెళ్లి కుదిర్చారు. వెంటనే ఎన్టీపీసీలోని చిలుకలయ్య ఆలయంలో సాదాసీదాగా వివాహం చేసుకుని కొత్త కాపురం ప్రారంభించారు. ఇక లేడీ తన కిలాడీల ప్రదర్శన ప్రారంభించింది. తనకు మందు, సిగరేట్లు కావాలంటూ యువకున్ని నిత్యం వేధింపులకు గురిచేసింది. ఇద్దరి మధ్య గొడవలు మొదలై రెండు నెలలు గడిచాయి. ఈక్రమంలో యువతి తన అక్క వద్దకు వెళ్తున్నానని ఇంట్లో ఉన్న రూ.70వేల నగదు, 4 తులాల బంగారు ఆభరణాలతో బిచానా ఎత్తేసింది. రోజులు గడుస్తున్నా తిరిగి రాకపోవడంతో యువకుడు ఆమె బంధువులు, మిత్రుల వద్ద ఆరా తీయడంతో అసలు విషయాలు బయటపడ్డాయి. అప్పటికే మూడు పెళ్లిలు అయ్యాయని, చాలా మందితో పరిచయాలు ఉన్నాయని తెలుసుకున్నాడు. చివరకు చిరునామా తెలుసుకుని వెళ్లడంతో సదరు యువతి తన మిత్రులతో విందు విలాసాలతో కనిపించింది. ఏకంగా వారందరూ పాన్‌షాప్ యువకుడిపై దాడి చేసి, వాటిని వీడియో తీశారు. ఈ వీడియోలు సదరు యువతి మిత్రులు సోషల్ మీడియాలో పెడతామంటూ బెదిరింపులకు గురిచేశారు. అంతేగాకుండా యువకుడి కుటుంబసభ్యులను సైతం డబ్బుల కోసం డిమాండ్ చేశారు. దీంతో యువకుడు ఎన్టీపీసీ పోలీసులను ఆశ్రయించి గోడు వెల్లబోసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

న్యాయం చేయండి..



పెండ్లి పేరుతో నన్ను ఆమె మోసం చేసింది. మా ఇంటి నుంచి నగదుతో పాటు బంగారం తీసుకెళ్లింది. ఆమెతో పాటు ఆమె స్నేహితుల నుంచి నాకు ప్రాణ భయం ఉంది. నాకు న్యాయం చేయాలి.

– రేవంత్, ఎన్టీపీసీ రామగుండం

యువతి కోసం గాలిస్తున్నాం

పెండ్లి చేసుకుని నగదు, బంగారు ఆభరణాలతో వెళ్లి ఫోన్ స్విచాఫ్ చేసిందని బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఆమె కోసం గాలిస్తున్నాం. చీటింగ్ కేసు నమోదు చేశాం. ఇటీవల హైదరాబాద్‌లో ఉందన్న సమాచారంతో వెళ్లినా ఆచూకీ దొరకలేదు. ఆమె పట్టుబడితే పూర్తి విషయాలు తెలిసే అవకాశాలున్నాయి.

– బి.జీవన్, ఎస్సై, ఎన్టీపీసీ